


చర్యలు తీసుకోవాల్సి ఉంది



డాక్టర్లు భయంతో పనిచేసే పరిస్థితి ఉండకూడదు. వైద్యులు, సిబ్బందిపై దాడి చేయాలంటేనే భయం కలగాలి. కఠినమైన చట్టాలతోనే ఇది సాధ్యమవుతుంది. కోల్‌కతా లాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. పటిష్ట చట్టాల అమలుకు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

– నవీన్‌కుమార్‌రెడ్డి,
చిత్తలూరు పీహెచ్‌సీ వైద్యుడు

రక్షణ ప్రభుత్వ బాధ్యత



డాక్టర్లు, సిబ్బంది విధులు నిర్వహించే క్రమంలో ఎలాంటి ప్రమాదం చోటు చేసుకున్నా వారిని రక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. ఆ విధంగా ఉన్నప్పుడే పూర్తిస్థాయిలో పనిచేసేందుకు వీలవుతుంది. ఇటీవల కోల్‌కతాలో జరిగిన ఘటన బాధాకరం. కిరాతకంగా ప్రవర్తించిన వారిపై కఠిన చర్యలు చేపట్టాలి.

– డాక్టర్ కె.శేషారత్నం,
ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్, ఆత్మకూరు

దాడులు చేయడం బాధాకరం



వైద్యులు ఎంతో కష్టపడి పనిచేస్తారు. రోగులను సంపూర్ణ ఆరోగ్యవంతులను చేయాలని కృషి చేస్తుంటారు. అలాంటి వారి సేవలను గుర్తించకుండానే పలువురు దాడులు చేయడం బాధాకరం. ఇటీవల జరిగిన సంఘటనలతో విధులు నిర్వహించాంటేనే డాక్టర్లు భయపడుతున్నారు. ముఖ్యంగా మహిళా వైద్యులకు రక్షణ కల్పించాలి.

– డాక్టర్ శ్రావణ్‌కుమార్,
ఆత్మకూరు



చినుకు పడేనా.. సేద్యం సాగేనా?

- వేసవిని తలపిస్తున్న ఎండలు
- వర్షాధార పంటల సాగుకు సమాయత్తం
- పప్పు ధాన్యాల ధరలపై ఆశలు

పొదలకూరు : పైతట్టు రాష్ట్రాల్లో వరదల వల్ల ప్రాజెక్టుల్లోకి నీరు వచ్చి చేరుతుంటే ఇక్కడ మాత్రం చినుకు రాలడం లేదు. ఈ ఏడాది రబీలో మెట్ట సేద్యం సాగేలా లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. అక్కడక్కడ వర్షం కురుస్తున్నా రైతులకు ఉపయోగకరంగా లేదు. రైతులు సకాలంలో వర్షాలు కురుస్తాయని, మెట్ట సేద్యం సాగుతుందని ఆశలు పెట్టుకున్నారు. ఇప్పటికే దుక్కిదున్నకం పనులను పూర్తి చేయాల్సి ఉన్నా నేలలో తేమశాతం లేక వర్షం కోసం ఎదురుచూస్తున్నారు. గతేడాది వర్షాభావ పరిస్థితులు ఉన్నప్పటికీ రైతులు ఆగస్టులోనే మెట్టచేలను దున్ని సిద్ధం చేసుకున్నారు. రైతులు మినుము, పెసర చల్లేందుకు ఈ ఏడాది సాహసించలేకపోతున్నారు. అయితే అక్టోబరు మూడో వారం వరకు మెట్ట పంటల సాగుకు సమయం ఉన్నా రైతుల్లో ఉత్సాహం కనిపించడం లేదు. ప్రతి ఏటా ఈ ప్రాంతంలో మినుము, పెసర, అపరాల పంటలను రైతులు వేల ఎకరాల్లో సాగు చేపట్టే వారు. అంతేకాక ఈ ఏడాది సకాలంలో మెట్టపంటల సాగుకు వర్షాలు పడలేదు. ఈ నేపథ్యంలో రైతులు మెట్టపంటల జోలికి వెళ్లేందుకు వెనకడుగు వేస్తున్నారు.

పెట్టుబడులు అధికం

ప్రధాన మెట్టపంటల సాగైన మినుము, పెసర సేద్యం వ్యయం విపరీతంగా పెరిగింది. పురుగు మందులు, దుక్కిదున్నకం, భూముల లీజులు పరిశీలిస్తే రైతులు ఖర్చులను భరించలేకపోతున్నారు. ఎకరాకు సుమారు రూ.20 వేల పైనే సాగుకు ఖర్చవుతోంది. అయితే మినుము, పెసర వద్దకు వచ్చేసరికి వీటి ధరలు ఎలా ఉంటాయో తెలియని పరిస్థితి ఉంది. ఎకరాకు నాలుగు బస్తాల దిగుబడి జరిగినా ధరలు తగ్గితే పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి ఉండదు. అంతే కాక దిగుబడి వస్తుందనే నమ్మకం కూడా లేకపోవడంతో పప్పు దినుసుల సాగు ఈ ప్రాంతంలో తగ్గుముఖం పడుతోంది. ఈ ఏడాది వర్షాలు సకాలంలో కురిసి, మినుము, పెసర, శనగ పంటలు పండితే మద్దతు ధరపై రైతులు ఆశలు పెట్టుకున్నారు. ప్రభుత్వం పప్పు దినుసుల సాగును ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



చుక్క నీరు లేని చెరువు



దుక్కి దున్నకం పనులు చేపట్టిన పొలం

సెప్టెంబర్ సమీపిస్తున్నా.. ఎండలు

సెప్టెంబరు మాసం సమీపిస్తున్నా వర్షాల జాడ కానరావడం లేదు. మెట్ట రైతులు మినుము, పెసర, పచ్చిశనగ, కంది పంటల సాగుకు సమాయత్తం అయ్యేవారు. అయితే వర్షాలు పడడం అటుంచి ఎండలు మండుతున్నాయి. పొదలకూరులో ప్రాంతంలో జూన్‌లో సాధారణ వర్షపాతం 54.1 మీ.మీ కాగా 115 మీ.మీ వర్షపాతం నమోదైంది. జూలైలో 86.3 సాధారణ వర్షపాతం కాగా 175.2 వర్షపాతం నమోదైందని అధికారులు తెలిపారు. ఆగస్టులో సాధారణ వర్షపాతం 86.0 నమోదు కావల్సి ఉండగా ఇప్పటి వరకు వర్షం కురిసింది లేదు. సెప్టెంబరులో 110.2 మి.మీ సాధారణ వర్షపాతం నమోదు కావల్సి ఉంది. సాధారణ పరిస్థితుల్లో అయితే ఈ పాటికే కొందరు రైతులు మినుము, పెసర విత్తనాలను విత్తేవారు.

చినుకు జాడ లేదు



ప్రాజెక్టుల్లో ఆశించిన స్థాయిలో నీటినిల్వలు లేవు. ఆగస్టు మాసంలో చినుకు జాడ కనిపించడం లేదు. ఎండలు వేసవి కాలాన్ని తలపిస్తున్నాయి. ఒకపక్క నిమ్మతోటలు వాడుతుండగా రైతులు ఆందోళన చెందుతున్నారు. వెంటనే వర్షం కురిస్తే ఫలితం ఉంటుంది.

– పి.రమణారెడ్డి, రైతు, పొదలకూరు

క్లుప్తంగా

ఆంజనేయస్వామికి విశేష పూజలు

పొదలకూరు : పట్టణంలోని మారుతీనగర్‌లో ఉన్న శ్రీవీర అభయాంజనేయస్వామికి అర్చకులు మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఉభయకర్తలుగా గౌడ్ సేవా సంఘం వారు వ్యవహరించారు. ఉదయం ఆకుపూజ, అభిషేకాలు, ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం వందలాది మంది భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. తిరిగి సాయంత్రం ప్రత్యేక పూజలు, పల్లకిసేవ, గ్రామోత్సవం గావించారు. ఈ పూజా కార్యక్రమాల్లో రాష్ట్ర, జిల్లా స్థాయి గౌడ్ సేవాసంఘం నాయకులు పాల్గొన్నారు.

పీడబ్ల్యూఏ మండల కన్వీనర్‌గా యాకోబు



తోడేటి యాకోబు

విడవలూరు : పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్(పీడబ్ల్యూఏ) విడవలూరు మండల కన్వీనర్‌గా ఊటుకూరు కంచరపాళేనికి చెందిన తోడేటి యాకోబును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం మాట్లాడుతూ తనను మండల కన్వీనర్‌గా ప్రతిపాదించిన పీడబ్ల్యూఏ అసోసియేషన్ వ్యవస్థాపకుడు గడ్డం హనోక్, రాష్ట్ర అధ్యక్షుడు పాస్టర్ ఐఎస్ బెన్‌హర్ బాబులకు కృతజ్ఞతలు తెలిపారు. తనకు సహాయ సహకారాలు అందించిన పీడబ్ల్యూఏ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌కు, ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఎం.జాషువాకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. మండలంలోని పాస్టర్లకు ఏ కష్టం వచ్చినా వెంటనే స్పందించి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

శాస్త్రోక్తంగా లక్ష కుంకుమార్చన



లక్ష కుంకుమార్చనలో భక్తులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని జొన్నవాడ గ్రామంలో వెలసిన మల్లికార్జున సమేత కామాక్షితాయి ఆలయంలో మంగళవారం సామూహిక లక్ష కుంకుమార్చన శాస్త్రోక్తంగా జరిగింది. తొలుత స్వామి, అమ్మవార్లను సుందరంగా అలంకరించి మండపంలో కొలువుదీర్చారు. అనంతరం మహిళలు భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం, తీర్థ ప్రసాదాల వితరణ జరిగింది. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి చేజింగ్ కేసులో ఎస్సైకు అవార్డు



ఎస్సై అజయ్‌కుమార్‌కు అవార్డు అందజేస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

మనుబోలు : గంజాయి చేజింగ్ కేసులో ప్రతిభ కనబరిచిన మనుబోలు ఎస్సై అజయ్‌కుమార్‌ను ఎస్పీ కృష్ణకాంత్ నెల్లూరులోని తన కార్యాలయంలో మంగళవారం అవార్డుతో సత్కరించారు. ఇటీవల వెంకటాచలం టోల్‌ప్లాజా వద్ద డీఎస్పీ శ్రీనివాసరావును కారుతో ఢీకొట్టి పరారైన గంజాయి స్మగ్లర్‌లను పోలీసులు వెంబడించి మర్రిపాడు వద్ద చాకచక్యంగా అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. ఇందులో మనుబోలు ఎస్సై అజయ్‌కుమార్ ప్రతిభ కనబరిచారు. దీంతో ఆయనకు ఎస్పీ అవార్డు అందజేసి అభినందించారు.

పేద విద్యార్థులకు ఏపీజీబీ చేయూత



కోవూరు : స్థానిక పచ్చిపాల రామనాథమ్మ బాలికోన్నత పాఠశాలలో ముగ్గురు పేద విద్యార్థులకు ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు వారు రూ.5000 చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. ఈ మేరకు మంగళవారం పాఠశాలలో కోవూరు బ్రాంచ్ మేనేజర్ వినయ్ చేతుల మీదుగా వారికి అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఝాన్సీరాణి, పీడీ దేవిక, సహచర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మనుబోలు ఎస్సైగా రాకేష్



రాకేష్

మనుబోలు : మనుబోలు ఎస్సైగా ఎంఎస్ రాకేష్‌ను నియమిస్తూ ఎస్పీ కృష్ణకాంత్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన ప్రస్తుతం నెల్లూరు వీఆర్‌లో ఉన్నారు. ఇప్పటి వరకు మనుబోలు ఎస్సైగా ఉన్న అజయ్‌కుమార్ బదిలీపై చిత్తూరు జిల్లాకు వెళ్లిన విషయం తెలిసిందే. రాకేష్ బుధవారం బాధ్యతలు చేపడతారని సమాచారం.

నేత్రపర్వం.. కల్యాణం



ముత్తుకూరు : శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో భాగంగా మంగళవారం రాత్రి పలు గ్రామాల్లో శ్రీకృష్ణుడు–రుక్మిణి కల్యాణ వేడుకలు నేత్రపర్వంగా జరిగాయి. ఇందులో భాగంగా ముత్తుకూరు, కృష్ణపట్నం, మల్లూరు తదితర గ్రామాల్లో విద్యుద్దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించిన ఆలయాల్లో కల్యాణ వేడుకలు భక్తులను కనువిందు చేశాయి. వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య జరిగిన కల్యాణ మహోత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మహిళల స్వావలంబనతో సమాజం ముందంజ



గార్మెంట్స్ తయారీ మహిళలతో కలెక్టర్ ఆనంద్

- కలెక్టర్ ఆనంద్

మనుబోలు(వెంకటాచలం) : మహిళలు ఆర్థిక స్వావలంబన సాధిస్తే సమాజం ముందంజ వేస్తుందని కలెక్టర్ ఓ ఆనంద్ అన్నారు. వెంకటాచలం మండలంలోని పారిశ్రామిక వాడలో ఉన్న హోజారే రెడీమేడ్ క్లస్టర్, హనీ ఇండస్ట్రీస్, అక్షయపాత్రలను మంగళవారం ఆయన పరిశీలించారు. అక్షయపాత్ర ద్వారా అన్న క్యాంటీన్లు, ప్రభుత్వ పాఠశాలలకు భోజనం సరఫరా, నాణ్యత తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రెడీమేడ్ గార్మెంట్స్ క్లస్టర్‌లో మొక్కలు నాటారు. ఇక్కడ ఉపాధి పొందుతున్న మహిళలతో ముఖాముఖీ మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు అన్నిరంగాల్లో మహిళలు ముందంజ వేస్తున్నారని, వారు ఆర్థికంగా ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకుని తద్వారా దేశాభివృద్ధిలో భాగస్వాములు కావడం ఆహ్వానించదగ్గ పరిణామమన్నారు. ఆయన వెంట జీఎండీఐసీ సుధాకర్, ఏపీఐఐసీ డిప్యూటీ జోనల్ మేనేజర్ సురేష్, పారిశ్రామికవేత్త కొట్టే రామ్మూర్తి, వసంతలక్ష్మి తదితరలు పాల్గొన్నారు.

ఓటరు కార్డుల దగ్ధంపై విచారణ

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మండలంలోని పెనుబల్లి గ్రామంలో గత శుక్రవారం ఓటరు గుర్తింపు కార్డులు దగ్ధమైన విషయమై తహసీల్దార్ అంబటి వెంకటేశ్వర్లు మంగళవారం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో భాగంగా గ్రామంలోని హరిజనవాడ పాత కమ్యూనిటీ హాలులో డబుల్ ఎంట్రీ ఉన్న ఐడీ కార్డులు ఉంచినట్లు తెలిపారు. గత శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తులు వాటిని చెత్తలో పడేయడం, కాల్చివేయడం గ్రామస్తుల ద్వారా తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. ఈ విషయమై నివేదికను తయారు చేసి ఉన్నతాధికారులకు అందజేస్తామని వివరించారు.

ఎస్పీ ఆకస్మిక తనిఖీ



నేరాల నమోదు పట్టికను పరిశీలిస్తున్న ఎస్పీ

కోవూరు : కోవూరు పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ కృష్ణకాంత్ మంగళవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. సర్కిల్ కార్యాలయంలో నేరాల నమోదు పట్టికపై ఆరాతీశారు. అనంతరం ఆయన సిబ్బందితో మాట్లాడారు. విధుల్లో అంకిత భావంతో పనిచేయాలన్నారు. రాత్రి సమయాల్లో గస్తీని ముమ్మరం చేయాలన్నారు. ఆయన వెంట సీఐ సుధాకర్‌రెడ్డి, ఎస్సై రంగనాథ్‌గౌడ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కోతల సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలి

కోవూరు : రైతులు వరికోతల సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఏఓ ఇందిరావతి తెలిపారు. కోవూరులో జరుగుతున్న వరికోతలను మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. సిబ్బంది మౌనిక ఉన్నారు.

చేతుల శుభ్రతతో రోగాలు దూరం

- ఎంఈఓ వసంతకుమారి



మాట్లాడుతున్న ఎంఈఓ వసంతకుమారి

కొడవలూరు : చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా అనేక రోగాలను దూరం చేయవచ్చని ఎంఈఓ జి.వసంతకుమారి సూచించారు. కొడవలూరులోని మండల విద్యావనరుల కేంద్రంలో కొడవలూరు, విడవలూరు, అల్లూరు మండలాల ఉపాధ్యాయులకు 'డెటాల్ బనేగా స్వస్థ్ ఇండియా'పై మంగళవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చేతులను సబ్బుతో కడిగేటప్పుడు ఏడు రకాల సూత్రాలను పాటించాల్సి ఉందన్నారు. గోళ్ల సందుల్లో ఎలాంటి మురికి లేకుండా ఉండేలా చూసుకోవాలన్నారు. చేతులు శుభ్రంగా లేకపోతే క్రిములు, బ్యాక్టీరియా, వైరస్‌లు మనం తీసుకునే ఆహారం ద్వారా శరీరంలోకి వెళ్లి తీవ్ర ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. ఈ విషయాలను విద్యార్థులకు తెలియజేయడం ద్వారా ఆరోగ్యవంతులుగా ఉంటారని చెప్పారు. ఎంఈఓ ఎస్.అంకయ్య మాట్లాడుతూ వ్యక్తిగత శుభ్రత, ఇంటి పరిసరాల పరిశుభ్రత, పాఠశాలల్లో పరిశుభ్రతపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. డీబీఎస్‌ఐ రాష్ట్ర ప్రోగామ్ మేనేజర్ ఏఎస్.కుమారి పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో డీబీఎస్‌ఐ జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ విష్ణువర్ధన్, సీఆర్‌ఎంటీలు పాల్గొన్నారు.

తెగుళ్లపై అప్రమత్తత అవసరం



ఇస్కపాళెంలో తెగులు సోకిన వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

- ఏడీఏ రాజ్‌కుమార్

తోటపల్లిగూడూరు : వరిపైరును నాశనం చేసే కాండం కుళ్ల తెగుళ్లపై రైతులు అప్రమత్తంగా ఉండాలని ఇందుకూరుపేట డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకుడు రాజ్‌కుమార్ సూచించారు. మండలంలోని ఇస్కపాళెం గ్రామంలో ఖరీఫ్ వరి పంటను వ్యవసాయాధికారులు మంగళవారం పరిశీలించారు. ఈ క్రమంలో పంటకు కాండం కుళ్ల తెగులు ఆశించినట్లుగా గుర్తించారు. ఈ సందర్భంగా ఏడీఏ రాజ్‌కుమార్ మాట్లాడుతూ ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో వరి సాగు ఆశాజనకంగానే ఉందన్నారు. అలాగే ధాన్యం ధరలు కూడా రైతులకు గిట్టుబాటుగా ఉన్నాయన్నారు. అయితే కొన్ని ప్రాంతాల్లో కాండం కుళ్ల తెగులు పంటను నాశనం చేస్తోందన్నారు. నత్రజని ఎరువులను అధికంగా వినియోగించడం, పొటాషీయం ఎరువులను ఎక్కువగా వాడకపోవడం, నీటి నిల్వలు ఎక్కువగా ఉండడం, విత్తన శుద్ధి చేయకపోవడం వంటి కారణాలతో ఈ తెగులు పంటను ఆశించే అవకాశం ఉందన్నారు. హెక్సా కొనాజోల్ 2 మిల్లీలీటర్లను లీటర్ నీటితో కలిపి పిచికారీ చేయాలన్నారు. అలాగే వాలిడామైసిన్‌ను రెండు మిల్లీలీటర్లకు ఒక లీటరు నీటితో కలిపి పిచికారీ చేసినా కాండం కుళ్ల తెగులును నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి శిరీషారాణి, గ్రామ వ్యవసాయ సహాయకులు షర్మిల, నిరూష, సుమంత్, పలువురు రైతులు పాల్గొన్నారు.

విశ్వనాథునికి రుద్రాభిషేకం



ప్రత్యేకాలంకరణలో విశ్వనాథుడు

మనుబోలు : మనుబోలు, చెర్లోపల్లి రైల్వేగేటు సమీపంలో ఉన్న విశ్వనాథస్వామి ఆలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని మంగళవారం రాత్రి వివిధ రకాల సుగంధ ద్రవ్యాలు, పంచామృతాలతో రుద్రాభిషేకం నిర్వహించారు. అర్చకుడు శ్రీనివాసులు విశ్వనాథస్వామికి ప్రత్యేక పుష్పాలంకరణ చేసి విశేష పూజలు జరిపించి భక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు. బొమ్మిరెడ్డి సుజాతమ్మ, యువరాణి, భవదీప్ ఉభయకర్తలుగా వ్యవహరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. కూచిపూడి నృత్యకారిణి సుస్మిత కృష్ణుని వేషధారణలో ప్రదర్శించిన నృత్యం ఆకట్టుకుంది.

సెప్టెంబర్ 6 నుంచి వేళాంగణి ఆరాధనోత్సవాలు



పోస్టర్లను ఆవిష్కరించిన చర్చి పెద్దలు

తోటపల్లిగూడూరు : ఏసుక్రీస్తు తల్లి వేళాంగణి మాత ఆరాధనోత్సవాలు సెప్టెంబర్ 6, 7, 8వ తేదీల్లో మూడు రోజుల పాటు అంగరంగ వైభవంగా జరుగుతాయని చర్చి డైరెక్టర్ ఫాదర్ లోకాస్‌రాజ్ తెలిపారు. మండలంలోని కోడూరులో ఉన్న ప్రఖ్యాత వేళాంగణి మాత చర్చిలో ఈ మేరకు వారు మంగళవారం పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఫాదర్ లోకాస్‌రాజ్ మాట్లాడారు. సెప్టెంబర్ 8న వేళాంగణి మాత జన్మదినం సందర్భంగా ఆరాధనోత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోనే కోడూరు వేళాంగణి మాత చర్చికి ఎంతో గుర్తింపు ఉందని తెలియజేశారు. 1980లో నిర్మితమైన చర్చిలో ప్రతి ఏడాది వేళాంగణి మాత జన్మదిన ఉత్సవాలు క్రమం తప్పకుండా జరుగుతున్నాయన్నారు. ఈ క్రమంలో మూడు రోజుల పాటు జన్మదిన వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. ఈ ఉత్సవాలకు భక్తులు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

అడిషనల్ డీఎంహెచ్ఓ ఆకస్మిక తనిఖీ



పీహెచ్‌సీ సిబ్బందికి సూచనలిస్తున్న అడిషనల్ డీఎంహెచ్ఓ ఖాదర్‌వలీ

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మండలంలోని జొన్నవాడ పీహెచ్‌సీని అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ ఖాదర్‌వలీ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామాల్లో విధిగా ఫీవర్ సర్వే చేయాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ అహ్మద్‌బాబు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

వేడుకగా కృష్ణాష్టమి పూజలు



కొడవలూరు: పద్మనాభసత్రంలో శ్రీకృష్ణ భగవానుని ఊరేగింపు



పొదలకూరు : ప్రత్యేకాలంకరణలో స్వామివారు

కొడవలూరు : మండలంలోని పద్మనాభసత్రంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శ్రీకృష్ణ భగవానుని ఊరేగింపు మంగళవారం వేడుకగా నిర్వహించారు. శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని గ్రామంలో సోమవారం శ్రీకృష్ణుని ప్రతిమను ప్రతిష్ఠించి పూజలు నిర్వహించారు. రెండో రోజైన గోకులాష్టమి సందర్భంగా మంగళవారం ఊరేగింపు నిర్వహించారు. గ్రామ వీధుల్లో ఊరేగుతున్న శ్రీకృష్ణుని గ్రామస్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆ సేవా సమితి సభ్యులు చిరమన సురేష్, సుందరరాజా, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

- పొదలకూరు : పట్టణంలోని శ్రీలక్ష్మీగోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 9 గంటలకు శ్రీకృష్ణుని తిరుమంజనం, సాయంత్రం 6 గంటలకు శ్రీకృష్ణ సహస్రనామార్చన, 6.30 గంటలు ఉట్టి మహోత్సవం, 7 గంటలకు కృష్ణనామ సంకీర్తనలు, 8.30 గంటలకు ప్రసాద వితరణ జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.